క్లుప్తంగా

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ అందించాలి



ప్రత్తిపాడు: కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వర రావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ జి.కరుణకుమార్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులు, కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కౌలు రైతు సంఘ కార్యదర్శి జగన్నాథం మాట్లాడుతూ.. నల్లబర్లీ పొగాకును సాగు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి అప్పుల పాలయ్యారని, వెంటనే ప్రభుత్వం వారిని ఆదుకునేందుకు చర్యలు చేపట్టి కొనుగోళ్లు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘ అధ్యక్షుడు విటల్‌రెడ్డి, స్థానికులు పరమేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



పొన్నూరు: పట్టణంలోని లాడ్జిలలో బస చేసేందుకు వచ్చే వారి వద్ద ఆధార్ కార్డు ఉంటేనే అనుమతి ఇవ్వాలని.. ఎలాంటి ఐడీ కార్డులేని పక్షంలో గదులు అద్దెకు ఇవ్వవద్దని పట్టణ సీఐ వీరా నాయక్ లాడ్జి నిర్వాహకులకు సూచించారు. సోమవారం పట్టణంలోని లాడ్జిలలో ఆయన ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. లాడ్జిల్లో ఉంటున్న వారి వివరాలను పరిశీలించారు. లాడ్జిలలో బస చేసే అపరిచిత వ్యక్తుల సమాచారం ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. లాడ్జిలలో అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతలను కాపాడడానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు



పెదకాకాని: క్రమ శిక్షణతో ప్రతిభ కనబరస్తూ రాణించే విద్యార్థులకు ఉత్తమ గుర్తింపు లభిస్తుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అన్నారు. పది పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో రాణించిన మండలంలోని ఆరుగురు విద్యార్థులకు సోమవారం షైనింగ్ స్టార్ అవార్డులను అందించారు. వారిలో షేక్ రిజ్వానా, జెడ్పీహెచ్ఎస్ పెదకాకాని.. యోగితాదేవి, జెడ్పీహెచ్ఎస్ పెదకాకాని.. పిల్లి హెన్నప్రసన్న, గీతాంజలి విద్యాలయం, పెదకాకాని.. అగతవరప్పాడు శ్రీచైతన్య నుంచి ఎం.సిరిప్రియరెడ్డి, ఎస్‌హెచ్ఎస్ కృష్ణకౌశిక్, ఎల్ అఖిల్‌లు ఉన్నారని అన్నారు. వీరికి గుంటూరు ఎ కన్వెన్షన్ హాల్‌లో షైనింగ్ స్టార్ అవార్డులు, రూ.20 వేలు, మెడల్, అప్రిషియేషన్ సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎంఈఓ సత్యన్నారాయణరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖ కార్మికులకు సంఘీభావంగా నిరసన

లక్ష్మీపురం: విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం పోరాటం చేస్తున్న కార్మికులకు మద్దతుగా జిల్లా కేంద్రంలో కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర విలాస్ సెంటర్‌లో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి సీఐటీయూ నగర కార్యదర్శి కె.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వి.రాధాకృష్ణమూర్తి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ విశాఖలో 1600 రోజుల నుంచి కార్మికులు విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఆందోళన చేపడుతున్నారని తెలిపారు. ఇప్పటి వరకు విశాఖ ఉక్కును పరిరక్షిస్తున్నామని అనేక రకాల ప్రకటనలు చేస్తున్నారు కానీ ఆచరణలో ప్రైవేటీకరణకు అన్ని రకాల మార్గాలు ప్రభుత్వం చేపడుతుందని ఆరోపించారు. 5500 మంది కాంట్రాక్ట్ కార్మికులను విధుల నుంచి తొలగించడం అంటే విశాఖ ఉక్కును పరిరక్షించటమా అని ప్రశ్నించారు. నిర్బంధాలతో ఉద్యమాలను ఆపాలనుకుంటే అంత కంటే హేయమని చర్య మరొకటి లేదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ అరుణ్ కుమార్, ఎం.హనుమంతరావు, ఏపీఎఫ్‌టీయూ నాయకులు మేకల రవి, సీఐటీయూ పశ్చిమ నగర ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, అధ్యక్షుడు బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

మొక్కుబడిగా యోగాంధ్ర.. కొరవడుతున్న స్పందన

- ఫ్లెక్సీలతో ఫొటోలకు స్టిల్స్.. ఆపై ప్యాకప్
- పట్టుమని 100 అడుగులు కూడా వెయ్యకుండానే వెనక్కి
- నవ్వులపాలవుతున్న 'యోగాంధ్ర' ఆశయం
- పొన్నూరులో మొక్కుబడిగా అర్జీల స్వీకరణ



ప్రత్తిపాడులో ఫ్లెక్సీలతో మొక్కుబడిగా యోగాంధ్ర ర్యాలీ



పొన్నూరులో అర్జీ తీసుకుంటున్న తహసీల్దార్ జియా



మెయిన్ రోడ్డుపై నామమాత్రంగా నిర్వహిస్తున్న మానవహారం

ప్రత్తిపాడు: డైరెక్టర్ రైట్.. రెడీ.. యాక్షన్.. అనగానే సీన్ మొదలవుతుంది. కట్ అనగానే యాక్షన్ ఆగిపోతుంది. ఇది సినిమా షూటింగ్‌లో తంతు. కానీ ప్రత్తిపాడులో సోమవారం నిర్వహించిన యోగాంధ్ర ర్యాలీ కూడా అచ్చం అలానే జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో కె.శివ పార్వతి ఆధ్వర్యంలో యోగాంధ్ర ర్యాలీని నిర్వహించారు. కార్యాలయం మెయిన్ గేటు వద్ద అందరూ నిలబడి ఫ్లెక్సీలు పట్టుకుని అట్టహాసంగా ఫొటోలు దిగారు. అక్కడి నుంచి రోడ్డుపై ఓ 100 అడుగులు కూడా వెయ్యకుండానే ర్యాలీకి ప్యాకప్ చెప్పేశారు. అంతేకాదు.. అక్కడే మానవహారంగా ఏర్పడి చకచకా ఫొటోలు దిగేశారు. తరువాత తిరిగి కార్యాలయంలోనికి వెళ్లిపోయి ఎవరి సీటుల్లో వారు ఆసీనులయ్యారు. ఓ పక్క రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటే, క్షేత్ర స్థాయిలో అధికారులు మాత్రం ఉత్తుత్తి ర్యాలీలు నిర్వహిస్తూ కార్యక్రమాన్ని అభాసుపాలు చేస్తున్నారు.

పొన్నూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేస్తున్న స్పందన కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది. సోమవారం పొన్నూరు పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమానికి స్పందన కొరవడింది. పట్టణంలో 31 వార్డులు, 29 గ్రామాలు ఉన్నాయి. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రతి వారం 6 నుంచి 8 అర్జీలు దాటడంలేదు. వాటిని ఆయా కార్యాలయాలకు పంపించి అధికారులు చేతులు దులపుకొంటున్నారు. భూ సమస్యలు అధికంగా రావడంతో వాటి ఊసే ఎత్తడం లేదంటూ విమర్శలు వినబడుతున్నాయి. వారానికి 20 నుంచి 30 దరఖాస్తులు వస్తున్నా.. కొన్ని మాత్రమే నమోదు చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమానికి కూడా స్పందన కరువైంది. ప్రతి వారం నిర్వహిస్తున్న కార్యక్రమంలో అర్జీలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖర్‌రావు, అధికారులు పాల్గొన్నారు. 8 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ తెలిపారు. వాటిలో రెవిన్యూ 2, సివిల్ సప్లయిస్ 4, సర్వే సంబంధించి 2 దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించాలని సంబంధిత సిబ్బందిని ఆయన ఆదేశించారు.

పెదకాకాని: పెదకాకాని ప్రధాన సెంటర్‌లో సోమవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని మొక్కుబడిగా నిర్వహించి మమ అనిపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని అధికారులు నిర్వీర్యం చేస్తున్నారన్న విమర్శలు వినబడుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమావత్ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ కెల్లంపల్లి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ గుర్తింపు కార్డులు ఇవ్వాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

పొన్నూరు: పట్టణంలోని 16, 25 వార్డులలో నివసించే యానాది కుటుంబాలకు చెందిన పిల్లలకు ఆధార్ నమోదు చేయాలని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ కోరారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు మాట్లాడుతూ.. జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి పని చేసే యానాది కుటుంబాల పిల్లలకు జనన ధృవపత్రం లేకపోవడంతో ఆధార్ కార్డులు మంజూరు కావడంలేదని తెలిపారు. దీంతో రేషన్ కార్డులో పిల్లల పేర్లు లేని కారణంగా రేషన్, సంక్షేమ పథకాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. భర్త మరణ ధృవపత్రం లేకపోవడంతో వితంతువులు పెన్షన్ పొందలేని స్థితిలో ఉన్నారన్నారు. అర్హత కలిగిన వారందరికీ ఆధార్ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వ అధికారులు తక్షణం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రచయిత దేవరకొండ శ్రీనివాస్, పెద్ద బ్రహ్మయ్య, వెంకయ్య, సీతమ్మ, కోటేశ్వరమ్మ, పాపాలు, అప్పాయమ్మ, శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

గుంటూరు రూరల్: రోడ్డు దాటుతున్న వృద్ధురాలను మితిమీరిన వేగంతో వస్తున్న క్రషర్ లారీ ఢీకొనటంతో అక్కడికక్కడే ఆమె మృతి చెందింది. ఈ సంఘటన నల్లపాడు గ్రామంలోని కాలువ సెంటర్ వద్ద సోమవారం చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని స్తంబాలగరువుకు చెందిన మట్టుపల్లి కోటేశ్వరమ్మ(60) ఉదయం కాలువ సెంటర్‌లోని శ్రీనివాసకాలనీ వద్ద పనిపై వచ్చింది. అనంతరం రోడ్డును దాటుతుండగా పేరేచర్ల నుంచి వస్తున్న లారీ ఢీకొనటంతో ఆమె అక్కడికక్కడే ఛిద్రమై మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురికి తరలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

విజ్ఞాన్ నిరుల అధ్యాపకునికి డాక్టరేట్



డాక్టరేట్ పొందిన ఆనంద్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక

గుంటూరు రూరల్: తమ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకుడు జూపల్లి జెర్మయ్యానంద్‌కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రధానం చేసిందని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాధిక తెలిపారు. సోమవారం పెదపలకలూరు రోడ్డులోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆచార్య భట్టు నాగరాజు పరిశోధనా పర్యవేక్షణలో హ్యూమన్ రిసోర్స్ మానేజ్మెంట్ విభాగంలో 'క్వాలిటీ ఆఫ్ వర్క్ లైఫ్ ఆఫ్ విమెన్ ఎంప్లాయిస్ ఇన్ సౌత్ సెంట్రల్ రైల్వేస్ ఏ కంపేరటివ్ స్టడీ అమాంగ్ టెక్నికల్ అండ్ నాన్ టెక్నికల్ స్టాఫ్' అనే అంశంపై ఆనంద్ సమర్పించిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకుడికి విజ్ఞాన్ విద్యాసంస్థల అధ్యక్షుడు డాక్టర్ లావు రత్తయ్య, ఉపాధ్యక్షుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఇ.వేణుమాధవి, ఇతర అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

ప్రాంగణ ఎంపికల్లో విద్యార్థినుల ప్రతిభ

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పనే లక్ష్యంగా తమ కళాశాల కృషి చేస్తుందని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపల్ రెవరెండ్ సిస్టర్ టి.సంధ్య తెలిపారు. సోమవారం గోరంట్ల గ్రామంలోని కళాశాలలో హైదరాబాదుకు చెందిన టీసీఎస్ సంస్థ ప్రాంగణ ఎంపికలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రాంగణ ఎంపికల్లో కళాశాలకుచెందిన 7మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలను పొందిన విద్యార్థినులను కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జె.ప్రతాప్‌రెడ్డి, తదితరులు అభినందించారు.

ఎన్జీ రంగాకు నివాళి

గుంటూరు మెడికల్: స్వాతంత్ర్య సమరయోధులు ఆచార్య ఎన్జీ రంగా వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని రంగా విగ్రహానికి బీజేపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యడ్లపాటి స్వరూపారాణి, యడ్లపాటి రఘునాథబాబు, దేశు సత్యనారాయణ, ఎ.అంజిరెడ్డి, పాల్గొన్నారు.

జిందాల్ ఎనర్జీ ప్లాంట్ సందర్శన



అధికారులతో మాట్లాడుతున్న సురేష్‌కుమార్

గుంటూరు రూరల్: జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ సందర్శించారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపేటలోని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌ని పరిశీలించేందుకు రానున్న తరుణంలో సోమవారం ప్రిన్సిపల్ సెక్రటరీ సీడీఎంఏ డాక్టర్ సంపత్‌కుమార్, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి ప్లాంట్‌ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాంట్ సామర్థ్యం, పనితీరు, అవసరమైన వ్యర్థాలు, ఏ మున్సిపాల్టీల నుంచి ఎంత చెత్త వస్తుంది.. ఎంత విద్యుత్ ఉత్పత్తి అవుతుంది తదితర వివరాలను జిందాల్ ఏపీ ప్రాజెక్ట్ ప్రెసిడెంట్ ఎంవీ చారీ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. పర్యటనలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ఉపా సెల్ పీఓ రామారావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సీతాకల్యాణం హరికథా గానం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై కాజన విశ్వరూపాచారి వర్ధంతి సందర్భంగా సోమవారం సీతాకల్యాణం హరికథాగానం నిర్వహించారు. ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రముఖ హరికథా భాగవతారిణి తిరువళ్లూరి దివ్యసాయి సీతాకల్యాణాన్ని హరికథా గానం వివరించారు. వయోలిన్‌పై దక్షిణామూర్తి, మృదంగంపై సుబ్బారావు వాయిద్యాన్ని అందించారు.

ఏసీ కళాశాల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మోజెస్

గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాలలో ఇంటర్మీడియెట్ హెచ్ఈసీ విభాగం నుంచి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు ప్రభుత్వం నుంచి ప్రతిభా పురస్కారాలు అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్ తెలిపారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ హెచ్ఈసీలో 960 మార్కులు పొందిన గోరంట్ల లిఖిత్, 831 మార్కులు సాధించిన షేక్ ఫారూఖ్ అబ్దుల్లా రైజింగ్ స్టార్ అవార్డులను అందుకోవడం కళాశాలకు గర్వకారణమన్నారు. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా రూ.20 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందుకున్నారని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఏసీ లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గురవయ్య, కళాశాల చరిత్ర శాఖ విభాగాధిపతి ఎం.శిరిల్ కుమార్, అధ్యాపకులు ఎం.జాన్ న్యూటన్, పి.రాజేష్ విద్యార్థులను అభినందించారు.

గ్రామీణ బ్యాంక్ మెసెంజర్ ఉద్యోగులకు న్యాయం చేయాలి



రఘునాథరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వెంగళరెడ్డి, కృష్ణయ్య, వెంకట్రాముడు తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మెసెంజర్ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ బీఎంఎస్ ఆధ్వర్యంలో బ్యాంక్ జనరల్ మేనేజర్ రఘునాథరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎంఎస్ నాయకుడు జి.వెంగళరెడ్డి మాట్లాడుతూ డేట్ ఆఫ్ జాయినింగ్, కంప్యూటర్ ఇంక్రిమెంట్ అరియర్స్‌లో అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. ఆంధ్రా ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో పనిచేసే మెసెంజర్స్‌కు గతంలోని యాజమాన్యం చాలా ద్రోహం చేసిందన్నారు. స్పందించిన రఘునాథరెడ్డి, పరిశీలించి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో వెంగళరెడ్డితో పాటు ఎం.కృష్ణయ్య కదిరి వెంకట్రాముడు, డీవీఎస్ రాజు ఉన్నారు.

వైద్య కళాశాల అభివృద్ధికి దాతల సహాయం ఎనలేనిది



డాక్టర్ హేమంత్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి, తదితరులు

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల అభివృద్ధికి దాతల సహాయం ఎనలేనిదని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి అన్నారు. గుంటూరుకు చెందిన న్యూరో సర్జన్ డాక్టర్ ఉప్పుటూరి హేమంత్ వైద్య కళాశాలలో గేటు నిర్మాణం కోసం రూ.4 లక్షలు విరాళంగా ఇచ్చారు. విరాళంతో నిర్మించిన గేటును సోమవారం డాక్టర్ హేమంత్ ఉప్పుటూరి ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి మాట్లాడుతూ వైద్య కళాశాలలో దాతల సహాయంతో ఆరు నెలలకాలంలో రూ.4 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. అనంతరం విరాళం అందజేసిన డాక్టర్ హేమంత్‌ను సత్కరించారు.

ఆరు నెలలుగా పింఛన్ ఇవ్వకుండా వేధింపులు

ప్రత్తిపాడు: గ్రామంలోనే ఉంటున్న నాకు డోర్ లాక్ అని చూపిస్తూ, పింఛను ఇవ్వకుండా ఆరు నెలలుగా వేధింపులకు గురి చేస్తున్నారంటూ కొండేపాడు వాసి పీజీఆర్ఎస్‌లో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వివరాల్లోనికి వెళితే.. ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెం సచివాలయం క్లస్టర్‌లోని కొండేపాడుకు చెందిన పచ్చల శ్రీనివాసరావు గత ప్రభుత్వం నుంచి దివ్యాంగుని పింఛను పొందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత అధికారులు అతనికి పింఛనును పంపిణీ చేయకుండా నిలిపివేశారు. దీంతో శ్రీనివాసరావు గుంటూరులోని పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. స్థానిక అధికారులు అతను గ్రామంలో ఉండటం లేదని 'డోర్ లాక్' కారణంతో పింఛను ఇవ్వలేదని అబద్ధాలతో కూడిన అర్జీ పరిష్కార నివేదికను కలెక్టర్‌కు పంపారు. ఈ నేపథ్యంలో ఏం చేయాలో పాలుపోని శ్రీనివాసరావు తాజాగా సోమవారం ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం పీజీఆర్ఎస్‌లో మరో అర్జీ అందించారు. నాతో పాటు గ్రామంలో మరికొందరి పింఛన్లు కూడా ఇలానే కుట్రపూరితంగా నిలిపివేశారని పూర్తి దర్యాప్తు చేయాలని కోరారు. న్యాయంగా విచారణ జరిపించి యథావిధిగా పింఛను అందేలా చూడాలని విన్నవించారు. స్పందించిన తహసీల్దార్ కరుణకుమార్ అర్జీని సంబంధిత అధికారులకు పంపి తగు చర్యలకు సిఫారసు చేస్తామని అర్జీదారునికి చెప్పారు.

అర్హులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు పాశం రామారావు, నన్నపనేని శివాజీ

పెదకాకాని: ఎన్నో దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పాశం రామారావు డిమాండ్ చేశారు. పెదకాకాని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి మండల సీపీఎం కార్యదర్శి నన్నపనేని శివాజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ.. రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని వాగ్దానం చేసిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్న తమ వాగ్దానాన్ని నిలబెట్టుకోలేదన్నారు. నన్నపనేని శివాజీ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు వెంటనే ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని.. లేకపోతే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని అన్నారు. అనంతరం తహసీల్దార్ పి.కృష్ణకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరలో ఇళ్ల పట్టాలను అందిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజా రమేష్, బురదగుంట సాంబయ్య, సంకూరి నీలాంబరం, ఉల్లంగుల శివయ్య, కె.సత్యనారాయణ, బి.బాబురావు, పలు కాలనీ వాసులు షేక్ హసీనా, దోసర మల్లేశ్వరి, తాత హైమావతి, ఎ.నాగేశ్వరావు, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి



ఎంఈవోకు జాయినింగ్ ఆర్డర్లు అందిస్తున్న బదిలీపై వచ్చిన మోడల్ స్కూల్ హెచ్ఎం

ప్రత్తిపాడు: విద్యాభివృద్ధే లక్ష్యంగా ప్రధానోపాధ్యాయులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఎంఈవో సీహెచ్ రమాదేవి అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా నడింపాలెం హెచ్ డబ్ల్యూ పాఠశాలకు చినకాకాని హైస్కూల్ నుంచి కె.పద్మావతిదేవి.. చినకోండ్రుపాడు మెయిన్ పాఠశాలకు నాదెండ్ల హైస్కూల్ నుంచి ఎల్.సాంబశివరావు.. తుమ్మలపాలెం ఎంపీయూపీ స్కూలుకు పెదనందిపాడు హైస్కూల్ నుంచి ఎస్.ఉషారాణి.. పెదగొట్టిపాడు ఎల్ఈ పాఠశాలకు తుళ్లూరు హైస్కూల్ నుంచి డి.షీలా.. వంగిపురం బీఎఫ్ఎస్ పాఠశాలకు అనంతవరప్పాడు హైస్కూల్ నుంచి మొహమ్మద్ ఎండీ గౌస్‌లు మోడల్ ప్రైమరీ పాఠశాలలకు బదిలీపై వచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం వారంతా స్థానిక మండల విద్యా వనరుల కార్యాలయంలో ఎంఈవో రమాదేవిని కలిసి జాయినింగ్ ఆర్డర్లను అందించారు. ఎంఈవో మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి, ఉత్తమ బోధన అందించాలని కోరారు.

నకిలీ విత్తనాల ముఠాలను అరికట్టాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న కేవీవీ ప్రసాద్

పెదకాకాని: ప్రభుత్వం నకిలీ విత్తనాలు విక్రయించి సొమ్ము చేసుకుంటున్న ముఠాల ఆగడాలను అరికట్టాలని రాష్ట్ర వ్యవసాయ సంఘం కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం పెదకాకాని మండల కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేవీవీ మాట్లాడుతూ.. ఖరీఫ్ పంటల సీజన్ మొదలైన నేపథ్యంలో ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేసి నకిలీ విత్తనాల ముఠాల ఆగడాలను అరికట్టాలని కోరారు. కౌలు రైతు కార్డులు త్వరితగతిన ప్రతి రైతుకు అందే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి, జిల్లా అగ్రిగోల్డ్ బాధితుల సంఘం కార్యదర్శి కేతినేని అగస్టీన్, నంబూరు గ్రామ సీపీఐ కార్యదర్శి కూసం నాగిరెడ్డి, వెనిగండ్ల సీపీఐ కార్యదర్శి షేక్ బాషీద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఇచ్చే అర్జీల శాశ్వత పరిష్కారానికి చర్యలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. పీజీఆర్ఎస్‌లో మేయర్ రవీంద్ర పాల్గొన్నారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 20 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేరువేరుగా లిస్టు తయారు చేయాలని కోరారు. డయల్ యువర్ కమిషనర్‌కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలని చెప్పారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకొని అధికారులతో మాట్లాడుతూ ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలని, ఆయా అర్జీలను ర్యాండమ్‌గా క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తామన్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు జీఎంసీ కార్యాలయానికి వస్తున్నారని, అవి స్థానికంగానే పరిష్కారం చేయాలన్నారు. ప్రజల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదుల నమోదుకి ప్రతి విభాగంలో ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేయాలని కోరారు. పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలన్నారు. సోమవారం ప్రజల నుంచి మొత్తం 29 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 8, ఇంజినీరింగ్ విభాగానికి 8, రెవెన్యూ విభాగానికి 5, ప్రజారోగ్య విభాగానికి 5, పరిపాలన విభాగానికి 1, అకౌంట్స్ విభాగానికి 2 చొప్పున ఫిర్యాదులు అందాయన్నారు. పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి అందిన అర్జీలను విభాగాల వారిగా విభజించి, సంబంధిత విభాగాధిపతులకి పంపి సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, మేనేజర్ బాలజీ బాషా పాల్గొన్నారు.